క్లుప్తంగా

రుషికొండలో షూటింగ్ సందడి



లొకేషన్‌లో జబర్దస్త్ అప్పారావు, ఇతర నటులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలో శనివారం షూటింగ్ సందడి నెలకొంది. సూపర్ హిట్ ఫిల్మ్స్ బ్యానర్‌పై కల్కి దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కిస్తున్న రాయిపటం అనే సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను ఇక్కడ ప్రాంతాల్లో చిత్రీకరించారు. హీరో నరేంద్ర, హీరోయిన్ పింకీ, జబర్దస్త్ నటుడు అప్పారావుపై పలు సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాకు నిర్మాతగా రాజు, మ్యూజిక్ డైరెక్టర్‌గా శశి వ్యవహరిస్తున్నట్లు డైరెక్టర్ కల్కి తెలిపారు. సినిమా షూటింగ్ చూసేందుకు వందలాది మంది ప్రజలు ఇక్కడికి చేరుకున్నారు.

శ్రీవారి గోశాల ప్రారంభం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద ఆదివారం ఉదయం 11 గంటలకు హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీవారి గోశాల ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి భక్తులంతా హాజరు కావాలని మూవ్‌మెంట్ ప్రతినిధి యదురాజ దాస తెలిపారు.

ఓం నమో వేంకటేశాయ

శ్రీవారి నామస్మరణతో మార్మోగిన రుషికొండ



శ్రీవారి పాదాల వద్ద పూజ చేస్తున్న మహిళలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి (టీటీడీ) ఆలయంలో శ్రీవారిని శనివారం వందలాది మంది భక్తులు దర్శించుకున్నారు. వేకువజామున సుప్రభాత సేవ, తోమాల సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. ముందుగా శ్రీవారి పాదాల వద్ద మహిళలు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవారిని దర్శించుకుని ఆలయ ప్రాంగణంలోని గోదాదేవి, పద్మావతి అమ్మవార్లను దర్శించుకున్నారు. సాయంత్రం కోలాటం, అన్నమయ్య కీర్తనలు భక్తులను అలరించాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కిషోర్ పర్యవేక్షించారు.

నేడు శిల్పారామంలో నృత్య ప్రదర్శనలు


పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం 6 గంటలకు శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందని స్థానిక పరిపాలనాధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు. సింహాచలానికి చెందిన సరస్వతి నృత్య కళామందిరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

అవంతి ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ ప్లస్ గ్రేడ్

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు జాతీయ స్థాయిలో నాక్ ఏ ప్లస్ గ్రేడ్ లభించింది. ఈ సందర్భంగా అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల ఉత్తరాంధ్ర ఫార్మసీ కళాశాలల్లో తమ కళాశాల 3.28/4.00 సీజీపీఏ సాధించి ఉన్నత స్థానంలో నిలిచిందన్నారు. కళాశాలలో అన్ని విభాగాల సమష్టి కృషితోనే అత్యధిక గ్రేడ్ సాధించామన్నారు. గత నెల 27, 28 తేదీలలో నాక్ బృందం తమ కళాశాలలో పర్యటించి, అన్ని విభాగాలు పరిశీలించి ఈ గ్రేడ్‌ను ప్రకటించిందన్నారు. వివిధ విభాగాధిపతులు, ఐక్యూ, ఏసీ సెల్, ఎన్ఎస్ఎస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కళాశాల అలుమ్ని అసోసియేషన్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ యాక్టివిటీస్ ప్రతిభతో మంచి గ్రేడ్ లభించిందన్నారు. ఈ సందర్భంగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని అభినందించారు.

గుక్కెడు నీరూ గగనమే..

కురపల్లిలో తాగునీటికి అవస్థలు



నల్లమారమ్మ ఆలయం వద్ద బోరే దిక్కు

సుమారు అర కిలో మీటరు పైగా దూరంలో ఉన్న నల్లమారమ్మ ఆలయం వద్ద భక్తుల కోసం ఒక వ్యక్తి తన సొంత నిధులతో తవ్విన బోరు నీరే వీరి దాహార్తి తీరుస్తోంది. దీంతో గ్రామస్తులు అక్కడికే తాగునీటి కోసం పరుగులు తీస్తున్నారు. సుమారు నాలుగేళ్ల నుంచి తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ కురపల్లిలో గుక్కెడు నీరూ గగనమై ప్రజలు అల్లాడుతున్నారు. ఈ ప్రాంతాల్లోని వాటర్ ట్యాంకులు, కుళాయిలు, బోరు బావుల నీరు తాగునీటికి పనికి రాకపోవడంతో తాగునీటికి అవస్థలు పడుతున్నారు.

పాండ్రంగి పంచాయతీలో పాత కురపల్లి, కురపల్లి బీసీ కాలనీ ఉన్నాయి. ఈ రెండు ఆవాస ప్రాంతాల్లో సుమారు ఎనిమిది వందల మంది జనాభా నివసిస్తున్నారు. పాత కురపల్లిలో పాత వాటర్ ట్యాంకు, ఒక బోరు బావి, కుళాయిలు ఉన్నాయి. వీటి ద్వారా వచ్చే నీరు ఉప్పగా ఉంటుంది. ఈ నీరు తాగడానికి పనికి రాదు. వాడుకకు మాత్రమే ప్రజలు ఈ నీటిని వాడుకుంటున్నారు. బీసీ కాలనీలో పాత వాటర్ ట్యాంకు, ఒక బోరు బావి ఉన్నాయి. **ట్యాంకుకు అనుసంధానంగా జల జీవన్ మిషన్ కింద కాలనీలో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఈ కుళాయిలు, బోరు బావి నీరు తాగడానికి పని రావు, నీరు చప్పగా ఉంటుంది.** దీని వల్ల పాత కురపల్లి, బీసీ కాలనీ వాసులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. గుక్కెడు నీటి కోసం కటకటలాడిపోతున్నారు.



పాత కురపల్లిలో అలంకారప్రాయంగా మిగిలిన వాటర్ ట్యాంకు



పాత కురపల్లిలో తాగడానికి పనికి రాని బోరు బావి

అర కిలోమీటరు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం



మా గ్రామంలో సుమారు నాలుగు వందల మంది ఉన్నాం. అందరం నాలుగేళ్లుగా అరకిలోమీటరు పైగా దూరం వెళ్లి, నల్లమారమ్మ ఆలయ బోరు బావి నుంచి నీరు తెచ్చుకుని దాహం తీర్చుకుంటున్నాం. కొత్తగా నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం పనులను త్వరగా పూర్తి చేసి, దీని ద్వారా మాకు తాగు నీరు సరఫరా చేయాలి. ట్యాంకు నిర్మించారు, పైపు లైను కూడా వేసి సురక్షితమైన నీరు సరఫరా చేయాలి.

– ఎం.నారాయణమ్మ, పాత కురపల్లి

ఉప్పనీరు తాగలేం



మా గ్రామంలో వాటర్ ట్యాంకు, బోరు బావి, కుళాయిలు ఉన్నా, నీరు ఉప్పగా ఉండటంతో కనీసం వంట చేసుకునేందుకు కూడా పనికి రాదు. ఈ నీటితో పప్పులు కూడా ఉడకవు. వాడుకకు ఉపయోగపడుతుంది. స్నానాలకు, అంట్లు తోముకోడానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నాం. నల్లమారమ్మ గుడి వద్ద బోరు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని గొంతు తడుపుకొంటున్నాం.

– ఆర్.గురమ్మ, పాత కురపల్లి

మా కాలనీలో నీరు చప్పగా ఉంటుంది



మా బీసీ కాలనీలో వాటర్ ట్యాంకు, ఒక బోరు ఉంది. వాటర్ ట్యాంకుకు అనుసంధానంగా ఇంటింటికి కుళాయిలు వేశారు. ఈ కుళాయిలు, బోరు బావి ద్వారా వచ్చేనీరు చప్పగా ఉంటుంది. దీని వల్ల ఈ నీరు తాగలేక పోతున్నాం. గత్యంతరం లేక నల్ల మారమ్మ ఆలయం వద్ద ఉన్న బావి వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుని తాగుతున్నాం.

– ఆర్.రామయ్యమ్మ, బీసీ కాలనీ

వైఎస్సార్‌సీపీ హయాంలో ట్యాంకు నిర్మించినా..

ఈ రెండు గ్రామాలకు సురక్షితమైన నీరు సరఫరా చేసేందుకు జలజీవన్ మిషన్ నిధులతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో చెత్త నుంచి సంపద తయారీ చేసే కేంద్రం వద్ద వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ట్యాంకు నిర్మించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో తరువాత నుంచి పనులు జరగలేదు. ట్యాంక్ నుంచి పాత కురపల్లి, బీసీ కాలనీకి పైపు లైను వేయలేదు.



నల్ల మారమ్మ ఆలయ బోరు బావి వద్ద తాగు నీరు పట్టుకుంటున్న మహిళలు

ఇంధన ప్రోత్సాహకం రూ.కోటి గెలుచుకుందాం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

తగరపువలస: పీఎం సూర్యఘర్ యోజన పథకం ద్వారా అత్యధిక పునరుత్పాదక ఇంధన సరఫరా గ్రామాల్లో విజేతగా నిలిచి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.కోటి ప్రోత్సాహక బహుమతి గెలుచుకుందామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ జి.శ్యాంబాబు అన్నారు. భీమిలి మండలం తాళ్లవలస పాత పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పంచాయతీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. సౌరశక్తి వినియోగాన్ని పెంచే ప్రతిపాదిత నమూనా గ్రామంగా తాళ్లవలస ఎంపికైందన్నారు. ఇందులో విజేతగా నిలిస్తే పంచాయతీలో విద్యుత్ కనెక్షన్లు అమర్చుకునేందుకు ఒక్కో కనెక్షన్‌కు రూ.1000 ప్రోత్సాహకం అందిస్తారన్నారు. ఈ పథకం ద్వారా కనెక్షన్లు తీసుకునే వారికి ఆర్థిక భారం తగ్గి మిగులు విద్యుత్ కారణంగా మరింత ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ ఇంటికప్పుపై సోలార్ ప్యానల్స్ అమర్చడం ద్వారా సౌర విద్యుత్ పొందవచ్చన్నారు. ఒక కిలోవాట్ సామర్థ్యం కలిగిన కనెక్షన్‌కు రూ.30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు ప్రభుత్వం రాయితీగా ఇస్తుందన్నారు. డీపీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ సోలార్ ప్యానళ్ల ద్వారా విద్యుత్ సరఫరాపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి, ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ లీడ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఈఈ పోలాకి శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఈ ఆర్.రమేష్, ఈవో ఆర్డీ రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు డీఏఎన్ రాజు, ఏఈఈలు బొట్టా రవి, సురేష్‌కుమార్, సోలార్ వెండార్లు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



పీఠంలో జరుగుతున్న నవగ్రహ మండపారాధన పూజా కార్యక్రమాలు



విగ్రహాలకు క్షీరాధివాస పూజ చేస్తున్న భక్తులు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ కీతిన్‌పేటలోని శ్రీవిద్యా శక్తిపీఠంలో వారాహి, మానసాదేవి, కాలభైరవ సహిత స్ఫటిక శివలింగ ప్రతిష్టా మహోత్సవాలు శనివారం కనులపండువగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా పీఠాధిపతి సోమయాజుల కల్యాణ చక్రవర్తిశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టా సంకల్పం, గణపతి పూజ, పుణ్యావహచనం, దీక్షాధారణ, అఖండ దీపోత్సవం, వాస్తు, యోగిని, జలాధివాసం, క్షీరాధివాసం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 8.30 గంటలకు వినాయకుడు, దుర్గాదేవి, రాహుకేతువులు, నవనాగులు, మానసాదేవి, కాలభైరవుడు, వారాహిదేవి, స్ఫటిక లింగం తదితర 17 విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్లు కల్యాణ చక్రవర్తి శర్మ తెలిపారు. విగ్రహాల ప్రతిష్ట అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్టి



సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు చేస్తున్న భక్తులు



గెద్దపేటలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

తగరపువలస: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా భీమిలి మండలం, పట్టణ పరిధిలోని పలు ఆలయాలలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామికి అష్టోత్తర శతనామావళి అర్చనలతో పాటు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపించారు. చిట్టివలస జ్యూట్‌మిల్లు సుబ్రహ్మణ్యస్వామికి సమ్మివాని పేటకు చెందిన సమ్మి సత్యారావు, ఉమా మహేశ్వరి, తరుణ్‌కుమార్, పైల రాము కల్యాణం జరిపించారు. అర్చకులు ఆకెళ్ల భాగ్యరాజా, రవిగణేష్ అభిషేకాలు చేశారు. కొండపేట కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోనూ షష్టి వేడుకలు నిర్వహించారు.

గెద్దపేటలో..

పద్మనాభం: కోరాడ పంచాయతీ గెద్దపేటలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు నిర్వహించారు. వల్లీ దేవ సేన సహిత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి కల్యాణం నిర్వహించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోండ్రోతు శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

సిద్ధేశ్వరస్వామి పీఠంలో..



సిద్ధేశ్వర స్వామి పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

మధురవాడ: సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మధురవాడ సిద్ధేశ్వర స్వామి పీఠంలోని శివాలయం ఆవరణలోని సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ధర్మకర్త నరసింహమూర్తి, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

కార్తికేయునికి సహస్ర నామార్చన

కొమ్మాది జంక్షన్ వద్ద గల త్రిశక్తి ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరునికి సహస్ర నామార్చన నిర్వహించారు. ముందుగా పంచామృతాలతో, సుగంధాలతో అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు నిష్టల రాంబాబు శర్మ విభూతితో పూజలు చేశారు. పరిసర ప్రాంతాల భక్తులు హాజరయ్యారు.



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



త్రిశక్తి ఆలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పిల్లల బంగారు భవితకు తోడ్పడదాం

- ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులూ బాధ్యత వహించాలి
- విశాఖ ఎంపీ శ్రీభరత్
- పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్



ఆనందపురం కేజీబీవీ విద్యార్థులతో ఎంపీడీవో జానకి తదితరులు



ఎండాడ పాఠశాలలో..

తగరపువలస: పిల్లల బంగారు భవితకు అందరం తోడ్పడదామని విశాఖ ఎంపీ శ్రీభరత్ అన్నారు. చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. తమ పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, ఎంపీడీవో హనుమంతరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, ఎంఈవోలు శివరాణి, జయప్రద, ప్రధానోపాధ్యాయులు రోజామణి, మురళీమోహనరావు తదితరులు పాల్గొన్నారు.

- బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో భీమిలి డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, హెచ్ఎం అప్పలరాజు వేడుకలు నిర్వహించారు.
- రాయప్పాలెం జీవీఎంసీ హైస్కూల్‌లో హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో భీమిలి జెడ్పీ పి.ప్రేమ ప్రసన్నవాణి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సింగూరి ఆనందరావు, డొకర అప్పలనాయుడు, కె.ఎస్.ఎన్. మూర్తిలను సన్మానించారు.
- భీమిలి మండలం అన్నవరం యూపీ పాఠశాల సమావేశంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఆనందపురం మండలం ఎల్వీపాలెం కేజీబీవీ పాఠశాలలో ఎంపీడీవో డాక్టర్ వి.జానకి, డీఎస్పీ సాగర్ తదితరులు పాల్గొన్నారు. తాటితూరు జెడ్పీహైస్కూల్‌లో తల్లులు, విద్యార్థులు రంగవల్లులు తీర్చిదిద్దారు.



చిట్టివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

పద్మనాభం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలని జెడ్పీ సీఈవో నారాయణమూర్తి అన్నారు. రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన మండల స్థాయి మెగా పేరెంట్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విదార్థుల తల్లిదండ్రులకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్ ఆదినారాయణ, తహసీల్దార్ కె.ఆనందరావు, ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్, ఎంఈవో బాబూలాల్, హెచ్ఎం సన్యాసిరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అవసరం

మధురవాడ: ప్రభుత్వ పాఠశాలలను పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌ను ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్సీ రఘువర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల వద్ద హైవేపై త్వరలోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రతిష్టాత్మకమైన సమావేశానికి 10వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు రావాల్సి ఉన్నా, అలా చేయలేకపోవడం క్షమించరాని విషయమన్నారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ పాఠశాల జీవీఎంసీ పరిధిలో ఉన్నా, జెడ్పీ ఆధీనంలో ఉండడంతో నిధులు మంజూరు విషయంలో ఇబ్బందులు ఉన్నాయని, దీనిపై దృష్టి సారించాల్సి ఉందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లుల రంగవల్లుల పోటీలు పరిశీలించి, ఇతర పోటీలు ప్రారంభించారు.

- సమావేశంలో టీడీపీ నాయకులకు తప్ప ఇతరులెవరికీ చోటు కల్పించలేదు. వేదికపై ప్రోటోకాల్ లేనివారికి కూడా స్థానం కల్పించడంతో ప్రధానోపాధ్యాయుడు రవి, పాఠశాల కమిటీ చైర్మన్ అచ్యుతరావు, ఎంఈవోలు, ఇతర కమిటీ సభ్యులు కుర్చీలు లేక నిలబడాల్సి వచ్చింది.
- కొమ్మాది రిక్షా కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ప్రిన్సిపాల్ శాంతి కుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కమిటి చైర్మన్ బగాది జగదీశ్వరరావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.
- వాంబే కాలనీ సునీల్ శర్మ కాలనీలో హెచ్ఎం గీతాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ శంకరరావు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు బహుమతులు అందిస్తున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



చంద్రంపాలెం హైస్కూల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా, సీటు లేక నిలబడిన పాఠశాల హెచ్ఎం, కమిటీ చైర్మన్లు



మన బడి పుస్తకాన్ని విద్యార్థుల తల్లులకు అందిస్తున్న జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి

తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే సత్ఫలితాలు

భీమునిపట్నం: పిల్లల చదువు విషయంలో వారి తల్లిదండ్రులు కూడా తగిన బాధ్యత వహించాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి అన్నారు. స్థానిక నెహ్రూ ఉన్నత పాఠశాల వద్ద నిర్వహించిన పేరెంట్స్ డే మీటింగ్‌లో తల్లిదండ్రులకు రంగోలి, టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. మన బడి పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థుల తల్లులకు అందించారు. కార్పొరేటర్ గంటా అప్పలకొండ, డైట్ వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఎంఈవో జయప్రద, కలిగొట్ల శ్రీరామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయిని తిరుమల శ్రీదేవి పాల్గొన్నారు.

- ఆంధ్రప్రదేశ్ బాలికల గురుకుల పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్‌పర్సన్, పూర్వ విద్యార్థిని యార్లగడ్డ గీతాశ్రీకాంత్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేశారు. హెచ్ఎం జయప్రకాశ్, పాల్గొన్నారు.

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధ బాలికల ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని నూర్జహాన్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఎండాడ, మంగమారిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, తిమ్మాపురం, చేపలుప్పాడ ఎంపీపీ పాఠశాలల్లోనూ పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించారు. తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి కోలాటం ఆడారు. అనంతరం అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.

ఎస్‌జెడ్‌సీసీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశానికి 'ఐనాడ' హాజరు

తగరపువలస: తమిళనాడు రాజ్‌భవన్‌లో శనివారం జరిగిన సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ బోర్డు ఆఫ్ గవర్నర్స్ కార్యక్రమానికి జీవీఎంసీ ఒకటోవార్డు సంతపేటకు చెందిన ఐనాడ దుర్గాప్రసాద్ హాజరయ్యారు. గవర్నర్ ఆర్ఎన్ రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రభుత్వేతర ప్రతినిధిగా ఈయన హాజరయ్యారు. హమారా సంవిధాన్.. హమారా స్వాభిమాన్ కార్యక్రమం ప్రజలకు చేరేలా తెలుగులో సాంస్కృతిక కార్యక్రమాలు తయారు చేయాలని తనకు బాధ్యతలు అప్పగించారన్నారు. దుర్గాప్రసాద్ ఆనందపురం మండలం గిడిజాలలోని డిఫెన్స్ అకాడమీలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు. సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కళా ప్రముఖ్‌గానూ వ్యవహరిస్తున్నారు.

మాస్టర్ ప్లాన్ రోడ్డుకు మంగళం



పీఎం పాలెం రామాలయం వెనుక రోడ్డులో ఆక్రమణలు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు పీఎం పాలెం అవంతి కమ్యూనిటీ హాలు ఆవరణలో ఉన్న రామాలయం వెనుక రోడ్డు ఆక్రమణకు గురవుతోంది. హౌసింగ్ బోర్డు కాలనీ ఏర్పాటు సమయంలో వాటర్ ట్యాంక్, ఇతర కొండ పై ప్రాంతాలకు వెళ్లడానికి 30 అడుగుల రోడ్డును కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. అయితే, ఇక్కడి కార్‌షెడ్-ఆఖరి బస్టాప్ రోడ్డు మొదటి కొండ పైన ఉన్న వాటర్ ట్యాంక్ మధ్యలో ఆక్రమణలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. అక్కడి నివాసితులు కార్ పార్కింగ్, వ్యాపారాల కోసం ఇష్టానుసారంగా షెడ్‌లు ఏర్పాటు చేయడంతో మాస్టర్ ప్లాన్ రోడ్డు కనుమరుగయ్యే పరిస్థితులు ఎదురవుతున్నాయి. సచివాలయానికి అతి చేరువలో రోడ్డును ఇష్టానుసారం ఆక్రమిస్తున్నా సచివాలయ సిబ్బంది, టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఉన్నతాధికారులైనా స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.